క్లుప్తంగా

యూటీఎఫ్ కమిటీ ఎన్నిక ఏకగ్రీవం

పొందూరు: యూటీఎఫ్ మండల కమిటీ ఎన్నిక ఏకగ్రీవంగా జరిగింది. గౌరవ అధ్యక్షుడిగా గురుగుబెల్లి మధుబాబు, అధ్యక్షుడిగా గురుగుబెల్లి అప్పారావు, ప్రధాన కార్యదర్శిగా కేవీఎం సత్యనారాయణ, కోశాధికారిగా బొడ్డేపల్లి అర్జున్‌రావు ఎన్నికైయ్యారు. ఎన్నికల పరిశీలకులుగా యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు పొందూరు అప్పారావు వ్యవహరించారు.

యూటీఎఫ్ మండల కమిటీ అధ్యక్షుడిగా సుధీర్‌కుమార్..

నరసన్నపేట: యూటీఎఫ్ మండల కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు జిల్లా కోశాధికారి బమ్మిడి శ్రీరామమూర్తి ఆదివారం తెలిపారు. అధ్యక్షుడిగా టేకి సుధీర్‌కుమార్, ప్రధాన కార్యదర్శిగా కుంచి ఆదినారాయణ, సహాధ్యక్షులుగా ఆర్.బాబూరావు, వై.శివదేవి, కోశాధికారిగా జి.పాపారావు ఇతర కార్యవర్గాన్ని ఎన్నుకున్నట్లు చెప్పారు. కార్యవర్గ సభ్యులుగా మరో 10 మందిని ఎన్నుకున్నారు.

సేంద్రియ సాగుతో అధిక దిగుబడి



పంట కోత ప్రయోగం నిర్వహిస్తున్న సిబ్బంది

సారవకోట: మండలంలోని తొగిరి గ్రామానికి చెందిన రైతు సడగాన సత్యం 2.5 ఎకరాలలో రాగి పంటను సేంద్రియ పద్ధతి సాగు చేశారు. ప్రకృత వ్యవసాయ సిబ్బంది ఆదివారం పంట కోత ప్రయోగం చేపట్టి దిగుబడిని అంచనా వేశారు. సేంద్రియ పద్ధతులైన ఘన, ద్రవ జీవామృతం, నీమాస్త్రం, కషాయాలను వినియోగించి పండించడంతో గతం కంటే అధిక దిగుబడి సాధించినట్లు సిబ్బంది మోహన్‌రావు, ప్రకాశ్ తెలిపారు.

భక్తిశ్రద్ధలతో ఆంజనేయస్వామికి పూజలు



ఆలయంలో వేలాడదీసిన అరటి గెలలు

సారవకోట: మండలంలోని బద్రి పంచాయతీ గోవిందపురం గ్రామంలో అభయాంజనేయ స్వామి మందిర 7వ వార్షికోత్సవం పురస్కరించుకుని ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామి వారికి నిమ్మకాయలు, తమల పాకులతో అలంకరించారు. ఆలయ ప్రాంగణంలో అన్న సంతర్పణ చేపట్టారు.

300 మందికి వైద్య పరీక్షలు



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యుడు సురేష్

ఆమదాలవలస రూరల్: సీజనల్ వ్యాధులపై ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యుడు బొడ్డేపల్లి సురేష్ అన్నారు. మండలంలోఅక్కులపేట గ్రామంలో బొడ్డేపల్లి రాజగోపాలరావు జయంతిని పురస్కరించుకుని సన్‌రైజ్ ఆస్పత్రి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాన్ని ఆదివారం నిర్వహించారు. 300 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వైద్యుడు మాట్లాడుతూ గ్రామ పరిసరాలను పరిశుభ్రంగా ఉంటే సీజనల్ వ్యాధులకు దూరంగా ఉండవచ్చునని సూచించారు. వేడి ఆహార పదార్థాలు, సురక్షితమైన తాగునీటిని నిత్యం తీసుకుని ఆరోగ్య సూత్రాలు పాటించాలన్నారు. సర్పంచ్ బొడ్డేపల్లి వసుమతి, వైద్యులు శ్రీనివాస్, ఆస్పత్రి సిబ్బంది పాల్గొన్నారు.

208 మందికి వైద్య సేవలు..



వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యుడు సునీల్‌కుమార్

పొందూరు: స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద ఆదివారం నిర్వహించిన ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరానికి స్పందన లభించింది. ప్రభుత్వ ఆయుర్వేద వైద్యులు ఎం.సునీల్‌కుమార్ ఆధ్వర్యంలో 208 మంది రోగులకు తనిఖీ చేసి మందులు ఉచితంగా పంపిణీ చేశారు. రక్త పరీక్షలు చేశారు. డీఆర్వో రవికుమార్ పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంపై అవగాహన

పొందూరు: ప్రతి గ్రామంలో రైతులు 365 రోజులు పంటలు పండించాలని ప్రకృతి వ్యవసాయం ఎంసీఆర్‌పీ శంకర్ తెలిపారు. స్థానిక వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయం ప్రాంగణంలో పొందూరు, లావేరు, జి.సిగడాం మండలాల ప్రకృతి వ్యవసాయ సిబ్బందికి 365 రోజులు పంటలు పండించే విధానంపై శిక్షణ, అవగాహన కల్పించారు. విత్తన గుళికల తయారీ, విత్తనాల తయారీలో లాభాలు గురించి వివరించారు. ప్రకృతి వ్యవసాయం ఎంటీ కృష్ణ, సిబ్బంది పాల్గొన్నారు.

తలరాత మార్చే చేతిరాత

- నిరంతర సాధనతోనే అందమైన దస్తూరి సాధ్యం
- అధిక మార్కులు సాధించాలంటే చేతిరాత కూడా ముఖ్యమే..



కేజీబీవీలో పదో తరగతి విద్యార్థినులకు చేతిరాతపై అవగాహన కల్పిస్తున్న ఎస్‌ఓ కష్ణవేణి

హిరమండలం: పదో తరగతి పరీక్షలు సమీపిస్తున్నాయి. విద్యార్థులంతా చదువుపై ద్యాస పెట్టారు. పరీక్షల్లో మంచి మార్కులు సాధించాలంటే చదువుతోపాటు చక్కని చేతిరాత కూడా ముఖ్యమే. విద్యార్థులు సమాధానాలు ఎంత బాగా రాసినా.. పేపర్ మూల్యాంకనం చేసేవారికి విద్యార్థి చేతిరాత అర్థం కాకపోతే మార్కులు తక్కువగా వచ్చే అవకాశం ఉంది. చేతిరాతపై కూడా దృష్టి సారించాలి. పాతపట్నం నియోజకవర్గంలో 57 ఉన్నత పాఠశాలల్లో 3,258 మంది పదో తరగతి విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారు.

పాటించాల్సిన మెలకువలు..

- సమాధాన పత్రంలో రాసే జవాబులు సూటిగా, అక్షరాలు పొందికగా ఉంటే పేపరు దిద్దేవారు పూర్తిగా మార్కులు వేసే అవకాశం ఉంటుంది.
- పేజి పైభాగంలో ఒక అంగుళం, ఎడమవైపు అదేస్థాయిలో మార్జిన్ విడిచిపెట్టాలి.
- సామాన్య, భౌతికశాస్త్రాలలో బొమ్మలు గీసి భాగాలు గుర్తించే విషయంలో పెన్నును వత్తి పెట్టి రాయకూడదు. ఇలా చేస్తే పేపరు వెనుకభాగం పాడవుతుంది.
- పేజీలో వాక్యాలు పైనుంచి కిందకు లేదా పైకి ఉండకుండా వరుసలో ఉండాలి.
- పేజీకి పదహారు నుంచి ఇరవై లైన్లు మించి రాయకూడదు.
- రోజు కొద్దిసేపు సాధన చేస్తే పరీక్షలలో ఆందోళన లేకుండా సాఫీగా రాయవచ్చు.
- పెన్ను సక్రమంగా పట్టుకొని రాస్తే, రాసే అక్షరాలు మనకు కనిపించడంతో పాటు గుండ్రంగా ఉంటాయి.
- జవాబు రాసేటప్పుడు అట్టపైకి వాలిపోకుండా సాధ్యమైనంత వరకు కూర్చుని రాయడం మంచిది.
- అక్షరాలు, పదాలు వాక్యాలు మధ్య తగినంత ఖాళీ ఉంచాలి.

చేతిరాత మెరుగుపర్చుకోవాలి

అక్షర దోషాలు, గజిబిజీ చేతిరాత వల్ల విద్యార్థులు మార్కులు అధికంగా నష్టపోతారు. చదివిన వాటిని పదే పదే రాస్తూ ఉండటం వల్ల అటు రాతకు ఇటు ఆయా పాఠ్యాంశాలను గుర్తు ఉంచుకోవడానికి ఉపయోగపడుతోంది. సమాధాన పత్రాన్ని దిద్దే ఉపాధ్యాయుడుకి మంచి దస్తూరి కనబడితే ఆ ప్రభావం అతడు వేసే మార్కులపై సానుకూలంగా ఉంటుంది.

– ఎస్.కష్ణవేణి, ప్రత్యేక అధికారి, కేజీబీవీ హిరమండలం

అక్షరమే ఆయుధం



మార్కుల సాధనకు అందమైన చేతిరాత ఎంతో కీలకం. పదో తరగతి, ఇంటర్ విద్యార్థులు పాఠ్యాంశాలతోపాటుగా దస్తూరి మెరుగుపరుచుకోవడంపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలి. ముందుగా ప్రశ్నను క్షణ్ణంగా చదివి సమాధానం రాయాలి. విద్యార్థులు చదవడానికి ఎంత ప్రాధాన్యం ఇస్తారో అక్షరాలు గుండ్రంగా రాయడానికి అంతే శ్రద్ధ వహించాలి. వేగంగా, అందంగా రాయడం అనేది పరీక్షల విజయానికి సోపానం.

– యు.ఎస్.ఎన్.మూర్తి, హెచ్‌ఎం, ప్రభుత్వ ఉన్నత పాఠశాల, హిరమండలం

భక్తిశ్రద్ధలతో చక్రతీర్థ స్నానం



చక్రతీర్థ స్నానాలకు విగ్రహాలను తీసుకువెళ్తున్న గ్రామస్తులు

ఎల్.ఎన్.పేట: మండలంలోని మొదుగువలసలో గల భువనేశ్వరిదేవి, లక్ష్మీగణపతి సహిత శ్రీరామలింగేశ్వర, సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయం 29వ వార్షికోత్సవ వేడుకల్లో భాగంగా ఆదివారం స్వామివారి చక్రతీర్థ స్నానాలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. మూడు రోజులుగా జరుగుతున్న వేడుకల్లో భాగంగా భక్తుల కోసం అన్న సంతర్పణ ఏర్పాటు చేశారు.

సాయంత్రం శివపార్వతుల ఉత్సవ విగ్రహాలను నంది వాహనంపై ఊరేగింపుగా తీసుకువెళ్లి వంశధార నదిలో వేసిన పందిరిలో ప్రత్యేక పూజలు నిర్వహించి చక్రతీర్థ స్నానాలు చేశారు. పరిసర గ్రామాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు.

రహదారి పనుల పరిశీలన



రోడ్డు పనులను పరిశీలిస్తున్న ఏఈ

ఎల్.ఎన్.పేట: మండలంలోని ప్రధాన రహదారి అలికాం–బత్తిలి (ఏబీ) రహదారి పనులను ఆర్‌అండ్‌బీ ఏఈ కిరణ్ కుమార్ ఆదివారం పరిశీలించారు. మండలంలోని బొర్రంపేట, స్కాట్‌పేట గ్రామాల వద్ద ఉన్న గోతులు లేకుండా తారు రోడ్డు వేసే పనులు చేపట్టామని ఏఈ తెలిపారు. మిగిలిన చోట్ల గుంతలు పూడ్చి, రోడ్డు మెరుగుపర్చే పనులు వారం రోజుల్లో పూర్తిచేస్తామన్నారు. ప్రస్తుతం సరుబుజ్జిలి నుంచి హిరమండలం వరకు ఉన్న గోతులు పూడ్చే పనులు చేస్తున్నట్లు తెలిపారు.

మెరుగైన వైద్య సేవలు అందజేయాలి



మాట్లాడుతున్న ఎంపీపీ మురళి

నరసన్నపేట: ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవలు అందివ్వాలని నరసన్నపేట ఎంపీపీ ఆరంగి మురళి, ఆస్పత్రి డవలప్‌మెంట్ సొసైటీ సభ్యులు అన్నారు. మాకివలస పీహెచ్‌సీలో ఆదివారం అభివృద్ధి కమిటీ సమావేశం నిర్వహించారు. వైద్యుల, సిబ్బంది పనితీరును ఎంపీపీ, కమిటీ సభ్యులు తెలుసుకున్నారు. పీహెచ్‌సీలో ఉన్న రూ.1.70 లక్షల నిధులు వినియోగానికి తీర్మానం చేశారు. ప్రభుత్వ నిబంధనల మేరకు వైద్య సేవలు పూర్తిస్థాయిలో అందివ్వాలని సూచించారు. ప్రభుత్వం వైద్య రంగానికి అధికంగా నిధులు ఖర్చుచేస్తుందన్నారు. నాడు–నేడు పథకం ద్వారా ఆస్పత్రులను అభివృద్ధి చేస్తున్నట్లు తెలిపారు. తహసీల్దార్ సింహాచలం, ఎంపీడీఓ మధుసూదనరావు, సర్పంచ్ మోహనరావు, వైద్యులు శిరీష, దుష్యంత్ తదితరులు పాల్గొన్నారు.

ఓటర్ స్లిప్పుల పంపిణీ



సీఐ డి.రాముకి ఓటరు స్లిప్పు అందజేస్తున్న వీఆర్వో

నరసన్నపేట: ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించిన ఓటర్ స్లిప్పులు పంపిణీ కార్యక్రమం వీఆర్వోలు చురుగ్గా నిర్వహిస్తున్నారు. మండలంలో 2429 మంది ఓటర్లు ఉన్నారు. సకాలంలో స్లిప్పులు పంపిణీ పూర్తిచేయాలని జేసీ ఆదేశించడంతో ఆదివారం కూడా వీఆర్వోలు ఓటర్లుకు స్లిప్పులు అందజేశారు. పోలింగ్ కేంద్రం ఎక్కడ ఉంది, ఏ పోలింగ్ కేంద్రానికి వెళ్లాలనేది వీఆర్వోలు తెలియజేస్తున్నారు.

ఆత్మీయ కలయిక



సత్యనారాయణస్వామిని దర్శించుకుంటున్న సంఘం సభ్యులు

పాతపట్నం: బూరగాంలో గల సత్యనారాయణ స్వామి ఆలయం ఆవరణలో జిల్లా చాత్తాడ శ్రీవైష్ణవ సంఘం ఆధ్వర్యంలో ఆత్మీయ కలయిక కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. చాత్తాడ శ్రీవైష్ణవ రాష్ట్ర డైరెక్టర్ దాసం లక్ష్మీనారాయణస్వామి మాట్లాడుతూ సంఘం తరపున పేదలను ఆదుకోవాలని, పేద విద్యార్థులకు పోత్సాహం కల్పించాలన్నారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు అందరికీ అందేలా చూడాలన్నారు. పౌరోహిత్యం శిక్షణ తీసుకున్న వారిని అభినందించారు.

అనంతరం సత్యనారాయణస్వామిని దర్శించుకున్నారు. రిటైర్డ్ హెచ్‌ఎం వామన మురళి, డి.వి.చారి, ఎస్వీ రమణ, బందన భుజింగరావు, కొవెల శ్రీను, మురళీకృష్ణ, నాగభూషణరావు, సంఘం సభ్యులు పాల్గొన్నారు.

త్రినాథస్వామికి ప్రత్యేక పూజలు

సారవకోట: మండలంలోని వడ్డినవలస గ్రామంలో గల త్రినాథస్వామి ఆలయ 66వ వార్షికోత్సవాలు ఆదివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ఆలయాన్ని విద్యుత్ దీపాలతో అలంకరించి గర్భగుడిని, మూల విరాట్‌ను పూలతో అలంకరించారు. ఆలయ ప్రాంగణంలో హోమం, ప్రత్యేక, విశేష పూజలు, అభిషేకాలు నిర్వహించారు. లక్ష్మీనారాయణ, పార్వతీపరమేశ్వరుల కల్యాణాలను నిర్వహించినట్లు అర్చకులు మనోజ్‌శర్మ తెలిపారు. చుట్టు పక్కల గ్రామాల నుంచి వచ్చిన భక్తులు ఆలయం వద్ద బారులు తీరారు. మూడు రోజులపాటు ఈ ఉత్సవాలు నిర్వహించనున్నట్లు మూడు రోజులు ప్రత్యేక పూజలు నిర్వహిస్తామన్నారు.

12న పూర్వ విద్యార్థుల సమ్మేళనం

నరసన్నపేట: ఈ నెల 12న స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 1978–83 మధ్య చదువుకున్న పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించనున్నారు. ఈ మేరకు విద్యార్థుల సంఘం ప్రతినిధులు ఎం.క్రాంతి, చందన, ఎంకన్న ఆధ్వర్యంలో సన్నాహక సమావేశం ఆదివారం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేశారు. పలువురు పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

యువకునిపై కేసు నమోదు

పాతపట్నం: జాతీయ రహదారిపై పాతపట్నంలో ఆదివారం అత్యంత వేగంగా ద్విచక్ర వాహనాన్ని డ్రైవింగ్ చేసిన ఒడిశా యువకునిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ ఎస్.కామేశ్వరరావు తెలిపారు. ఒడిశా రాష్ట్రం గుసాని బ్లాక్(మండలం) జూరాజ్‌పూర్ గ్రామానికి చెందిన యువకుడు సునీల్ ప్రధాన్ ద్విచక్ర వాహనాన్ని నిర్లక్ష్యంగా వాహనం నడపడంతో పోలీసులు పట్టుకున్నారు. ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు.

పశువులకు వ్యాక్సినేషన్



వాక్సినేషన్‌ను పరిశీలిస్తున్న ఏడీ ఆనందరావు

ఆమదాలవలస: పశువుల్లో సంక్రమించే గాలికుంటు వ్యాధిపై పాడిరైతులు అప్రమత్తంగా ఉండాలని పశుసంవర్థక శాఖ ఏడీ రోణంకి ఆనందరావు సూచించారు. మున్సిపాలిటీ పరిధి ఒకటో వార్డు తిమ్మాపురంలో పశువులకు ప్రభుత్వం ఉచితంగా అందించే గాలికుంటువ్యాధి నివారణ టీకాలను ఆదివారం వేశారు. ఈ వ్యాధి సోకిన పశువు నుంచి వేరొక పశువుకు అతి వేగంగా సంక్రమిస్తుందని, అటువంటి పశువులను దూరంగా ఉంచాలని సూచించారు. పశువైద్యాధికారి, సచివాలయ పరిధి పశు పోషకులు పాల్గొన్నారు.

సంక్షిప్తంగా..

విత్తన గుళికలతో ప్రయోజనం



విత్తన గుళికులు తయారు చేస్తున్న గిరిజన రైతులు

కొత్తూరు: విత్తన గుళికలు తయారు చేసుకోవడం వల్ల రైతులు ఎన్నో ప్రయోజనాలు పొందవచ్చునని ప్రకృతి వ్యవసాయం మాస్టర్ ట్రైనీ ఎస్.సూర్యనారాయణ తెలిపారు. మండలంలోని మహసింగిగూడలో గిరిజన రైతులకు విత్తన గుళికులు తయారీపై అవగాహన కల్పించారు. శత శాతం మెలకవస్తుందని, చీడపీడలు పట్టవన్నారు. వర్షం నెల రోజులు లేకపోయిన ఎటువంటి నష్టం జరగదన్నారు. ప్రతీ రైతు పప్పు ధాన్యాలకు మాత్రమే విత్తన గుళికలు తయారు చేసుకోవాలన్నారు. ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, గిరిజన రైతులు పాల్గొన్నారు.

పదో తరగతి విద్యార్థులకు మోడల్ పరీక్ష

కొత్తూరు: స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో పదో తరగతి విద్యార్థులకు ఆదివారం మోడల్ పరీక్ష నిర్వహించారు. పదో తరగతి పబ్లిక్ పరీక్షలు సమీపిస్తున్నందున విద్యార్థుల్లో పరీక్షలంటే భయం పోవడానికి మోడల్ పరీక్ష నిర్వహించినట్లు ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి బి.హరీష్ తెలిపారు.

జూదరుల అరెస్టు

కొత్తూరు: మహసింగి గూడ సమీపంలోని మామిడి తోటలో జూద శిబిరంపై కొత్తూరు సీఐ వేణుగోపాలరావు, ఎస్‌ఐ గోవిందరావు తమ సిబ్బందితో ఆదివారం దాడి చేశారు. రూ.14,800 నగదను స్వాధీనం చేసుకున్నారు. ఎనిమిది మందిలో ఏడుగురు పట్టుబడ్డారు. ఒకరు పరారైనట్లు ఎస్‌ఐ చెప్పారు. కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ చెప్పారు.

సారవకోట: మండలంలోని అవలింగి గ్రామంలోని జగన్నాథ స్వామి ఆలయానికి జూదం ఆడుతున్న ఏడుగురుని అరెస్టు చేసినట్లు ఎస్‌ఐ అప్పారావు ఆదివారం తెలిపారు. వారి వద్ద నుంచి రూ 6,290 స్వాధీనం చేసుకున్నామన్నారు.

నేటినుంచి డోలోత్సవాలు

హిరమండలం: మండలంలోని సుభలయ మెట్ట (తపోగిరి)పై ఉన్న వేంకటేశ్వర ఆలయలంలో ఈ నెల 6 నుంచి 8వ తేదీ వరకు డోలోత్సవాలు నిర్వహించనున్నారు. ఈ మేరకు అర్చకులు బృందావన పండా, ఆలయ కమిటీ సభ్యులు ఆదివారం తెలిపారు. దశాబ్దాలుగా ఈ ఉత్సవాలు నిర్వహించడం ఆనవాయితీగా వస్తుందన్నారు. ఈ మూడు రోజులు స్వామి వారికి ప్రత్యేక పూజలు, చక్రతీర్థస్నానాలు, అన్న సంతార్పణ, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు.



పోలాకి: పోలాకిలో ప్రచారం చేస్తున్న డీసీసీబీ చైర్మన్ కరిమి రాజేశ్వరరావు, వైఎస్సార్‌సీపీ నాయకులు



ఆమదాలవలస: పట్టణంలోని పార్టీ కార్యాలయంలో మాట్లాడుతున్న పార్టీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి సువ్వారి గాంధీ



ఆమదాలవలస రూరల్: చీమలవలసలో ప్రచారం చేస్తున్న చింతాడ రవికుమార్

సుధాకర్‌ను గెలిపించండి



పొందూరు: రాపాకలో ప్రచారం చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

ఉత్తరాంధ్ర పట్టభద్రుల వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీ అభ్యర్థి సీతంరాజు సుధాకర్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని వైఎస్సార్‌సీపీ నాయకులు గ్రామాల్లో ఆదివారం విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. ఆమదాలవలస, పాతపట్నం, నరసన్నపేట నియోజకవర్గాల్లోని పలు గ్రామాల్లో పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు ఇంటింటికీ వెళ్లి పట్టభద్రులను కలిసి మొదటి ప్రాధాన్యత ఓటు వేయాలని కోరారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చేస్తున్న అభివృద్ధిని వివరించారు. ఓటరు పేరు, పోలింగ్ కేంద్రంతో కూడిన కరపత్రాలను పంపిణీ చేశారు.

– సాక్షి నెట్‌వర్క్




ఆమదాలవలస రూరల్: కొత్తవలసలో ఎన్నికల ప్రచారం చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు



సారవకోట: సారవకోటలో ప్రచారం చేస్తున్న పార్టీ నాయకులు



పాతపట్నం: సింగుపురంలో ఓటర్లకు కరపత్రాలు అందజేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు



నరసన్నపేట: మారుతీనగర్‌లో ప్రచారం చేస్తున్న పార్టీ నాయకులు



జలుమూరు: శ్రీముఖలింగంలో ప్రచారం నిర్వహిస్తున్న ఎంపీపీ గోపి, పార్టీ నాయకులు



బూర్జ: కాలపర్తి సచివాలయం పరిధిలో ప్రచారం నిర్వహిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు



ఎల్.ఎన్.పేట: కొమ్మువలసలో ప్రచారం నిర్వహిస్తున్న పార్టీ నాయకులు



కొత్తూరు: మాట్లాడుతున్న వైస్ ఎంపీపీ లోతుగెడ్డ తులసీవరప్రసాదరావు